

బొంరాస్‌పేట : ఎనికేపల్లి గ్రామంలోని యూపీఎస్‌ను పరిశీలిస్తున్న వికారాబాద్ డీఈవో రేణుకాదేవి



మొయినాబాద్ : పెద్దమంగళారంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన రంగారెడ్డి డీఈవో సుశీందర్‌రావు

# సర్కారు బడుల్లో ప్రవేశాల సంఖ్య పెంచాలి

## వికారాబాద్ డీఈవో రేణుకాదేవి

బొంరాస్‌పేట, జూలై 19 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచాలని వికారాబాద్ డీఈవో రేణుకాదేవి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని ఎనికేపల్లి యూపీఎస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పాఠశాలలోని సమస్యలను డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. తగినంత మంది టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు కొడంగల్‌కు ప్రతి రోజూ నడుచుకుంటూ వెళ్లి వస్తున్నారని చెప్పారు. అదేవిధంగా పాఠశాలలో 'మన ఊరు-మనబడి'లో చేపట్టిన తరగతి గదులు, ప్రహరీల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయని.. వాటిని త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాలలో మూడు పోస్టులకు ముగ్గురు టీచర్లు ఉన్నారని.. విద్యార్థుల సంఖ్య పెరిగితే భవిష్యత్తులో అదనపు పోస్టులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. అసంపూర్తి పనులను త్వరగా పూర్తి అయ్యేలా చూస్తామన్నారు. ఆమె వెంట ఎంఈవో రాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టీచర్లు సమయపాలన పాటించాలి

### రంగారెడ్డి డీఈవో సుశీందర్‌రావు

మొయినాబాద్, జూలై 19 : ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని రంగారెడ్డి డీఈవో సుశీందర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన నజీబ్‌నగర్ గ్రామంలోని కేజీబీవీ పాఠశాల, పెద్దమంగళారం గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో వెంకటయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతంతోపాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి.. విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించి.. విద్యార్థులకు అర్థమయ్యేల బోధించాలని సూచించారు.

# 28న నేవీ రాడర్ స్టేషన్‌కు శంకుస్థాపన



పూడూరులోని దామగుండం అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

పూడూరు, జూలై 19 : మండలంలోని దామగుండం అడవిలో 2,900 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న నేవీ రాడర్ కేంద్రం పనులకు ఈ నెల 28న సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శంకుస్థాపన చేయనున్నట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సభ, హెలిప్యాడ్, శిలాఫలకం ఏర్పాటు స్థలాలను శుక్రవారం ఆయన కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఫారెస్ట్, నేవీ ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు రూ.2,500 కోట్లతో నేవీ రాడర్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం చుట్టూ 27 కిలో మీటర్ల వరకు రింగ్‌రోడ్డు నిర్మిస్తారని.. ఈ కేంద్రం ఏర్పాటైతే స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. వారి వెంట పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, ఆనందం, మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎండి.షకీల్, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సురేందర్, శ్రీనివాస్‌గుప్తా, అజీంపటేల్, శ్రీను, కృష్ణ, వెంకటేశంగుప్తా తదితరులు ఉన్నారు.



## మహంకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు

సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి దేవాలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఉత్సవాలకు రావాల్సిందిగా ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఆయన వెంట మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్, దేవదాయశాఖ కమిషనర్ హనుమంతరావు తదితరులున్నారు. –బేగంపేట్ జూలై 19

## మహంకాళి జాతరకు 175 బస్సులు

సిటీబ్యూరో, జూలై 19(నమస్తే తెలంగాణ): ఉజ్జయినీ మహంకాళి బోనాలను పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం నగర వ్యాప్తంగా బోనాలకు తరలివచ్చే భక్తుల కోసం 175 బస్సులను అందుబాటులో ఉంచినట్టు వివరించారు. ఈనెల 21, 22న ఈ సేవలు ఉంటాయని తెలిపారు. ఏమైనా బస్సుల ఆలస్యం సమస్యలు ఉంటే 9959226147, 9959226143, 9959226130 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

## ఇంటింటా ఇన్నోవేటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, జులై 19 ( నమస్తే తెలంగాణ ) : ఇంటింటా ఇన్నోవేటర్‌కు దరఖాస్తు చేసుకోవడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే 7799171299, 8712824996 నంబర్లకు ఫోన్ చేయాలని జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్‌రావు తెలిపారు. ఇన్నోవేటర్ దరఖాస్తును ఆగస్టు 3లోపు పంపించాలని సూచించారు. 91006 78543 వాట్సాప్ నంబర్‌కు దరఖాస్తు పంపించాలన్నారు. గృహిణులు, విద్యార్థులు, విద్యావేత్తలు, ఆవిష్కరణ నైపుణ్యం కలవాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

## నాపరాతి గనుల తనిఖీ

తాండూరు రూరల్, జూలై 19 : మండలంలోని సంగంకలాన్ పరిధిలోని సర్వేనంబర్–109లో అక్రమంగా నాపరాతి తవ్వకాలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు మైన్స్ ఏడీ సత్యనారాయణ, విజిలెన్స్ అధికారి నాగరాజ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు రెండు లారీలను సీజ్ చేసి, కరణ్‌కోట పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అక్రమంగా తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక వసతుల సరఫరాకు టెండర్లు

వికారాబాద్, జూలై 19 : జిల్లాలోని వెల్ఫేర్, రెసిడెన్షియల్ స్కూళ్లు, బీసీ, ఎస్సీ, ఎస్‌డబ్ల్యూ హాస్టళ్లు, గిరిజన, టీడబ్ల్యూ, కేజీబీవీ మైనారిటీ, అంగన్‌వాడీ పాఠశాలలకు మౌలిక వస్తువుల సరఫరాకు డీలర్ల నుంచి షీల్డ్ టెండర్లు కోరుతున్నట్లు డీఆర్‌డీవో శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2000 ఫ్యాన్లు, (800) 20 వాట్ల బాల్టన్ డే లైట్, ఎల్‌ఈడీ లైట్లు, (320) 100 వాట్ల ఎల్ఈడీ హాలోజన్ లైట్లు, (800) స్టీల్ ఫ్రేమ్ లతో కూడిన గాల్వనైజ్డ్ ఎంఎస్ డోర్లు సరఫరా కోసం డీలర్ల నుంచి షీల్డ్ టెండర్లు కోరమన్నారు. ఈ నెల 20 నుంచి 23 మధ్యాహ్నం 1 గంటల వరకు వికారాబాద్ జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయం నుంచి టెండర్ ఫారాలు పొంది 23 మధ్యాహ్నం 3 గంటల వరకు సమర్పించాలన్నారు. డీఆర్‌డీవో, డీఆర్‌డీఏ, వికారాబాద్ జిల్లా పేరున డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) ప్రతి టెండర్ దరఖాస్తు రూ. 5 వేలు చెల్లింపు చేయాలన్నారు. 23న సాయంత్రం 5 గంటలకు ఏజెన్సీల సమక్షం లో కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో టెండర్లు తెరుస్తారన్నారు.

## 89 మంది బాలకార్మికుల సంరక్షణ

సిటీబ్యూరో, జులై 19 ( నమస్తే తెలంగాణ ) : ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా 89 మంది బాలకార్మికులను సంరక్షించి ఆశ్రమం కల్పించామని హైదరాబాద్ జిల్లా బాలల సంరక్షణ అధికారి అక్కేశ్వరరావు తెలిపారు. ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

# క్షేమంగా ఇంటికి చేరిన చిన్నారి

- స్వయంగా పర్యవేక్షించిన శంషాబాద్ ఏపీపీ శ్రీనివాసరావు
- ఆగంతకుడ్ని పట్టుకునేందుకు పోలీసుల ముమ్మర ప్రయత్నం



తల్లితో చిన్నారి కాజల్ సింగ్

కొత్తూరు, జూలై 19 : అదృశ్యమైన చిన్నారి శుక్రవారం ఉదయం క్షేమంగా ఇంటికి చేరింది. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అంజయ్‌సింగ్, సుమిత్రాసింగ్ దంపతుల కుమార్తె కాజల్‌సింగ్(8) గురువారం సాయంత్రం ఇంటిముందు ఆడుకుంటుండగా ఓ ఆగంతకుడు ఆటోలో ఎక్కించుకొని తీసుకెళ్లాడని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు బృందాలను ఏర్పాటు చేసి ఎంజీబీఎస్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. కొత్తూరు సీఐ నరసింహారావు ఘటనాస్థలానికి చేరుకొని చిన్నారి తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు. కాగా శంషాబాద్ ఏసీపీ శ్రీనివాసరావు కొత్తూరు చేరుకొని కాజల్‌సింగ్ ఇంటిని సందర్శించారు. అయితే శుక్రవారం ఉదయం చిన్నారిని తీసుకెళ్లిన ఆగంతకుడు పాత జాతీయ రహదారిపై వదిలి వెళ్లిపోగా.. ఆమె ఇంటికి నడుచుకుంటూ చేరుకున్నది. చిన్నారిని ఆగంతకుడు ఎందుకు తీసుకెళ్లాడు. తిరిగి ఎందుకు వదిలివెళ్లాడు అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామన్నారు.




## మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు ఇవ్వొద్దు

మంచాల, జూలై 19 : మధ్యాహ్న భోజన పథకాన్ని వేరే సంస్థలకు అప్పగించొద్దని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న అన్నారు. శుక్రవారం మంచాల మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన రిలే దీక్షలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకాన్ని వేరే సంస్థలకు ఇవ్వొద్దని హెచ్చరించారు. కార్యక్రమం లో సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ, మధ్యాహ్న భోజన కార్మికులు సరిత, అలివేలు, లక్ష్మమ్మ, జంగమ్మ, భారతమ్మ పాల్గొన్నారు.

# ప్రజలతో మమేకమై పని చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

## హైదరాబాద్ పోలీసులతో డీజీపీ జితేందర్

సిటీబ్యూరో, జులై 19 (నమస్తే తెలంగాణ): సాంకేతిక వనరులను ఉపయోగిస్తూ విజుబులిటీ పోలీసింగ్‌తో ప్రజలతో మమేకమవుతూ ఉత్తమ సేవలందించాలని హైదరాబాద్ పోలీసులకు డీజీపీ జితేందర్ సూచించారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఆడిటోరియంలో నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి డీజీపీ హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా పోలీసింగ్‌లో మార్పు వచ్చిందని, స్థానిక అవసరాలకు అనుగుణంగా ఉత్తమ పద్ధతులను గ్రహిస్తూ ప్రత్యేకతను కల్గి ఉండాలన్నారు. హైదరాబాద్ గ్లోబల్, కాస్మో పాలిటన్ నగర మానవ వనరులు, టెక్నాలజీ, భారీగా పెట్టుబడులతో ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి జరగడం, అత్యంత నివాస యోగ్యమైన నగరంగా గుర్తింపు తెచ్చుకుందన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నగదు రహిత ట్రాఫిక్ చలాన్ విధానాన్ని అమలులోకి తెచ్చిన సందర్భంగా ఎదురైన సవాళ్లను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. సున్నితమైన విషయంలో మాట్లాడే సమయంలో ఎవరికి ఇబ్బంది లేకుండా మాట్లాడాలని, పౌరులతో సరిగా ప్రవర్తించాలని సూచించారు. ఫిర్యాదుదారులను తిప్పి పంపకూడదని వారి సమస్యను తెలుసుకోవాలన్నారు. నేరాలను అదుపు చేయాలని, సాంకేతిక పరమైన శిక్షణ తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఎన్‌ఫోర్స్‌మెంట్, సిగ్నల్స్ వినియోగం సాంకేతిక అంశాలపై దృష్టి పెట్టాలని, ట్రాఫిక్ విభాగం చేసే పనులను పౌరులతో పంచుకోవాలని సూచించారు. వీఐపీ సంస్కృతిని అరికట్టడంతో పాటు సోషల్‌మీడియాను హ్యాండిల్ చేసేందుకు మంచి టీమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని డీజీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీలు విక్రమ్‌సింగ్ మాన్, విశ్వప్రసాద్, జాయింట్ సీపీ పరిమళ హననూతన్‌తో పాటు డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

## రేపు శ్రీ వైష్ణవ సేవా సంఘం రజతోత్సవాలు



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి, వేణుగోపాలచారి

ఖైరతాబాద్, జూలై 19: శ్రీ వైష్ణవ సేవా సంఘం రజతోత్సవాలను ఈ నెల 21న మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘం స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు.

ముఖ్య అతిథిగా శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామనుజ, జీయర్ స్వామి హాజరై రజతోత్సవాలను ప్రారంభిస్తారని, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, తాండూర్ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, మనోహర్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా పది, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తామన్నారు. అనంతరం రజతోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాలచారి, శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శృంగారం తిరువేంగళాచార్యులుతో కలిసి ఆవిష్కరించారు.

# యూజీ కోర్సుల్లో కామర్స్‌కే డిమాండ్

## ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి



మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 19: విద్యార్థులు తమ భవిష్యత్‌కు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ కళాశాలలో తెలంగాణ కామర్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ మీట్ 'వాణిజ్య – 2024'ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ లింబాద్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో అందించే యూజీ కోర్సులలో కామర్స్ విభాగానికే ఎక్కువ డిమాండ్ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలోకామర్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ చెన్నప్ప, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, వాణిజ్య – 2024 కన్వీనర్ ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ డీన్ ప్రొఫెసర్ గంగాధర్, ప్రొఫెసర్ కృష్ణచైతన్య, ప్రొఫెసర్ ప్యాట్రిక్, డాక్టర్ సూర్యప్రవీణ్, ఎంవీ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.




పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న శిఖాగోయల్

## నిరంతర శ్రమతోనే విజయం సాధ్యం

రామంతాపూర్, జూలై 1: విద్యార్థులు లక్ష్యం ఎంచుకొని నిరంతర శ్రమతో విజయం సాధించవచ్చునని రాష్ట్ర మహిళా భద్రతా విభాగం సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ అన్నారు. శుక్రవారం రామంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన విద్యార్థి నాయకుల నియామకం, వివిధ రంగాల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ స్కూల్ సొసైటీ అధ్యక్షుడు గుస్తి నోరియా, ఫయాజ్ ఖాన్, శ్యామ్ మోహన్, వేణువినోద్, అశ్వినీకాంత్, డాక్టర్ రామచంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సల్లారం నర్సింహారెడ్డి, కిరణ్ పంజ్వాని, ఆదిత్యారెడ్డి, సాన్విత్‌మురారి ,రాగి శ్రీనిత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెరువులను పరిరక్షిస్తాం

## ఈవీడీఎం కమిషనర్ ఏవీ రంగనాథ్



ఫతుల్లాగూడ చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఈవీడీఎం కమిషనర్ ఏవీ రంగనాథ్

మన్సూరాబాద్, జూలై 19: చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని.. ఎవరైనా చెరువులను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతామని జీహెచ్‌ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవీడీఎం) కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. నాగోల్ డివిజన్ బండ్లగూడ పరిధిలోని ఫతుల్లాగూడ చెరువు ఆక్రమణకు గురైందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం సదరు ప్రాంతానికి ఈవీడీఎం కమిషనర్ ఏవీ రంగానాథ్ వెళ్లి పరిశీలించారు. ఫతుల్లాగూడ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కొంతమంది అక్రమ లే అవుట్ చేసి ఇండ్లు కట్టి ప్రజలకు విక్రయిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో సదరు ప్రాంతానికి విచ్చేసి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి వద్ద ఉన్న డాక్యుమెంట్లను పరిశీలించారు.

చెరువు కబ్జా విషయంపై మేడ్చల్, రంగారెడ్డి జిల్లా రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. గతంలో చెరువు పరిరక్షణ కోసం చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను తొలగించి తప్పుడు సర్వే నంబర్లతో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారని స్థానికులు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతుంటే మీరు ఏం చేస్తున్నారని అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ అధికారులను, ఇరిగేషన్ అధికారులను ఆయన ప్రశ్నించారు. అనంతరం ఫతుల్లాగూడ చెరువును డ్రోన్ల ద్వారా సర్వేను ప్రారంభించారు. సర్వే అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని ఏవీ రంగనాథ్ తెలిపారు. అనంతరం ఫతుల్లాగూడలోని డీఆర్‌ఎఫ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ ప్లానర్ కె.శ్రీనివాస్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీ హబ్‌తో ఒప్పందం

సిటీబ్యూరో, జూలై 19 (నమస్తే తెలంగాణ): టీ హబ్‌తో తమిళనాడు టెక్నాలజీ హబ్ సంస్థ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం ద్వారా దేశ వ్యాప్తంగా ఆవిష్కరణలను పెంపొందించడానికి, స్టార్టప్ కార్యకలాపాల పురోగతి పెంచడానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా ఇరు సంస్థలు కలిసి పనిచేస్తాయని టీ హబ్ ప్రతినిధి తెలిపారు. పట్టణ ప్రాంతాల నుంచి మొదలుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఆవిష్కరణలు చేయాలన్న ఆలోచనలు యువతలో బాగా పెరిగాయి. అలాంటి వారిని ప్రోత్సహించి, వారి ఆలోచనలను వ్యాపార నమూనా రూపొందించేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక, మార్గనిర్దేశం ఇచ్చేలా రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నాయని తెలిపారు.

# ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణకు కుట్ర




ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు అన్నారు. శుక్రవారం బ్యాంకు జాతీయ కరణ దినోత్సవం సందర్భంగా బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్ రోటరీ చౌరస్తాలోని దివంగత ప్రధాని ఇందిరా గాంధీకి నివాళులర్పించారు. అనంతరం ప్రదర్శన నిర్వహించి మాట్లాడారు. గతంలో 26 ప్రభుత్వ రంగ బ్యాంకులు ఉండగా నేడు 12కు పడిపోయిందన్నారు. ప్రజలు, ఉద్యోగులు వ్యతిరేకిస్తున్న బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు కేంద్రం పార్లమెంట్‌లో చట్టాన్ని తీసుకురావాలని చూస్తే దేశ వ్యాప్త ఆందోళన తప్పదన్నారు. పీవీ కృష్ణారావు, సమద్ ఖాన్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

–ఖైరతాబాద్, జూలై 19